హిందూ-ముస్లిం

సెట్టి ఈశ్వరరావు

పళ్ళదుకాణం ముందుకి రెండురోజుల పస్తుకడుపుతో వచ్చేడు రాందాసు. రాందాసు కళ్ళలోకి బుగ్గలోకి కొలత తీసుకుంటున్నట్టు అబ్బాస్ చూస్తున్నాడు. పాడయిపోయిన నూతుల్లాగున్నాయి. రెండు సంవత్సరాల కిందటి తన స్వరూపానికి ప్రతిబింబంలా వున్నాడు. ఆ దుర్దినాలు అబ్బాస్ ముందు నుంచున్నాయి.

"కూలి దొరుకుతుందా?" అన్నాడు రాందాసు. నూతిలోంచి తోడుతున్నట్టున్నాయి మాటలు. అబ్బాస్ మొహంవేపుకి కళ్ళుతిప్పి వుంచేడన్న మాటేగాని, ఏం చేస్తున్నాడో తనకే తెలీదు దాసుకి. కాలే కడుపు శరీరాన్నే కాకుండా బుద్ధిని కూడా నీరసపర్చింది.

అబ్బాస్ మేలుకున్నాడు.... "కూలి దొరుకుతుందా?" —తన బ్రతుక్కియింకోణ్ణి కూలికి పెట్టుకోవడంకూడానా అనిపించింది. బిగించుకపోతున్న పెదాలు బలవంతంగా విప్పి "లేదు-అక్కర్లేదు" అన్నాడు. నెత్తిమీంచి పళ్ళగంప దించుతున్నంత కష్టంతో.

ఊతగా పట్టుకున్న దుకాణపు రాటనుంచి చెయ్యిజార్చి వొళ్ళు యీడ్చుకుంటూ వెళ్ళిపోతున్నాడు దాసు.

కిందనుంచి మీదవరకూ రెప్ప వెయ్యకుండా చూస్తున్నాడు అబ్బాస్. దాసు ప్రతి దుకాణందగ్గిరా నిలబడి కూలి వెతుక్కుంటున్నాడు. పాదాలనుంచి పిక్కలవరకూ దిట్టంగా ఆశ్రయించుకున్న దూళి - ఆ దూళిలోకి యింకుతూన్న చెమట-పెచ్చులు పెచ్చులుగా వుంది. ఆ జుట్టులో నలుపుదనంకన్నా రోడ్డుదూళి రంగే చాలా యెక్కువ. చూస్తుండగానే మలుపు తిరిగిపోయేడు దాసు. ఇక చూడ్డం అనవసరమని తెలియక అబ్బాస్ ఇంకా అటే చూస్తున్నాడు. "ఈ పళ్ళు ఎంతకమ్ము

తున్నావ్?" అన్న పలకరింపు వినిపించింది. బరువుగా పీల్చిన గాలిని వొదిలిపెట్టి వ్యాపారస్పృహలోకొచ్చేడు.

"భాయీ మనం మనం ముసల్మానులం గాబట్టి నిజమైన ధర తక్కువదర కివ్వాలి నాకు?" అన్నాడు అభిమానం చూపెడుతూ

ముసల్మానుగదా అని మొదటే సాధ్యమైనంత తక్కువ ధర చెప్పేడు.

ఇక చిల్లిగవ్వ తగ్గించినా తనకి కిట్టుబాటవదు. సగానికి సగం ధరకి బేర మాడి కారెక్కి వెళ్ళిపోయేడు బేరగాడు. కారు ధూళి రేపుకుంటూ వెళ్ళిపోయింది. ధూళి గాలిలో కలిసిపోయేవరకు కూడా అదేపనిగా చూస్తున్నాడు అబ్బాస్. వెనకనే పోతున్న దొరగారి కారు ధూళి, మార్వాడీ కారుధూళి, ముసల్మాను సోదరుడి కారు ధూళిలాగే వున్నాయి - యే మాత్రం భేదంలేదు.

ఎక్కడా లాభించలేదు - రాందాసు మలుపు తిరిగి వస్తున్నాడు. రెండు సంవత్సరాలకిందటి తన స్థితిని, కంఠోపాఠంచేసి రాందాసు ఒప్ప చెపుతున్నట్లు కనిపించింది అబ్బాస్‌కి.

అబ్బాస్ దుకాణం ముందునుంచి వస్తున్నాడు రాందాసు.

"ఏమయ్యోయ్ - ఇటురా" అని పిలిచేడు అబ్బాస్ అనుకోకుండా. తోట కూర కాడలాగ వొంగిపోయి దుకాణంముందు నిలబడ్డాడు రాందాసు.

"ఏం, ఎక్కడా పని దొరకలేదా ?"

"లేదు" —మూలిగేడు దాసు.

"ఇంత నీర్సంగావున్న మనిషివి యేం పనిచేస్తావు ?"

"రెండు రోజులబట్టీ తిండిలేదు." —అడిగినదానికి సగానికే జవాబిచ్చేడు దాసు.

అబ్బాస్‌కి కడుపు తరుక్కుపోయింది. "రా, యీ బల్లమీద కూర్చో అని బల్ల చూపించేడు. తన ఆకలి రోజులు, పుస్తకం విప్పి కళ్ళ యెదుట పెట్టినట్టు కనిపిస్తున్నాయి, గొంతుక బద్దలయినట్లు మసీదు దగ్గర అరచినా, వొక దమ్మిడీ ధర్మంచేసిన పాపాన్నెవడూ పోలేదు. ఎంగిలిప్లేట్లు కడుక్కొని గడిపేడు కొన్నాళ్లు. గడ్డితవ్వి అమ్ముకొని బ్రతికేడు కొన్నిరోజులు. తన చిన్నప్పటి స్నేహితుడు సింగు

మదుపు యిచ్చి కొట్టు పెట్టడానికి సాయం చెయ్యబట్టి యివ్వుడు యింత అన్నం తిని బట్టకడుతున్నాడు. ఆ రోజులన్నీ మనసులో కొచ్చేసరికి అబ్బాస్‌కి కళ్ళనిండా నీళ్లుకమ్మాయి. ఆరోజులకి యిప్పటికి రాందాసు స్థితి అనువాదంలాగ కనిపిస్తూంది.

"నాదగ్గిరే వుందుగానిలే - నాదగ్గిరే వుందుగానిలే" అని గొణుక్కుంటూ లేచి బయటికెళ్ళాడు అబ్బాస్. ఈ వాలకం యేమిటో దాసుకి బోధపళ్లేదు.

రెండు చపాతీలు యింత దాల్ పట్టుకొని అబ్బాస్ తిరిగివొచ్చేడు. రాందాసు ముందు వుంచేడు. దాసు ఆశ్చర్యపోయి అబ్బాసును చూస్తున్నాడు. పెద్దపెద్ద షావుకార్లకులేని యీవి యీ సాయిబు కెలావచ్చిందిరా అని. అబ్బాస్ పైట చూపించి కానిమ్మని తల వూపేడు. కలియబడ్డట్టు దాసు తినడం ప్రారంభించేడు. పస్తులు పడిపడి యేద్దైనా యెప్పుడైనా దొరికినప్పుడు తను యెంత ఆత్రంగా తినేవాడో జ్ఞాపకం తెచ్చుకుంటూ అబ్బాస్ కుండలోని నీళ్ళుతెచ్చి దాసు ముందు పెట్టేడు.

రెండు చపాతీలు తినేసి గ్లాసులోని నీళ్ళు సగం తాగేసరికి - పిడుగులాంటి సంగతొకటి స్ఫురించింది.

ముస్లిం-పానీ ను తిన్న చపాతీలు తురకాడు ముట్టుకొన్నవీ: మిగిలిన నీళ్ళు తాగకుండా ఆగేడు ఒక క్షణం. మరో క్షణంలో తక్కిన నీళ్ళన్నీ ఒక్క గుక్కలో తాగేసేడు. దాసును కన్నజాతీ మతమూ వెలివేసినట్టు వెక్కిరించేయి: అతని ఆకలి రూపపు రౌద్రాకారం చూసి భయపడి పారిపోయేయి.

తన చర్మం చెప్పులుకుట్టి యిచ్చైనా అతని ఋణం తీర్చలేననుకున్నాడు దాసు. అంత నమ్మకంగావున్న దాసుని తన తమ్ముణ్ణి చూసినట్టు చూస్తున్నాడు అబ్బాస్. దాసు వొళ్ళు దాచుకోకుండా కష్టపడుతున్నాడు. అబ్బాస్ వ్యాపారం పుష్టికొస్తూంది.

కాఫర్‌ని దగ్గర పెట్టుకుని పోషిస్తున్నావెందుకని ముసల్మానులు అబ్బాస్‌ని మందలించారు తురకాడికి అరవదాకిరీచేసి, వాడి చేతికూడు తిని భ్రష్టుడయ్యేడన్నారు; తమకి తలవంపులుగా వుందని తమ మతస్థులు నిష్ఠురమాడేరు దాసుని. ఈ చెవిని విని ఆ చెవిని విడిచిపెట్టేసేరు ఇద్దరూ, పై మతాల్లోకూగా మంచివారున్నారని అబ్బాస్ బోధపర్చుకున్నాడు. తన కష్టదినాల్లో ఆదుపడినవాడు తురకైతే

నేం, మరెవరైతేనేం అని దాసు చలించలేదు. క్రమేపీ మతాలు జ్ఞాపకం రావడం మానేసేయి.

వర్తకం లాభంగా సాగుతూంది. అబ్బాసుని ఎప్పుడో వొకప్పుడు దగా చేస్తాడు కాఫర్ అని అంచనా వేసుకుంటున్నారు ముసల్మానులు "లాభాల్లో మూడో వంతు నీది" అని దాసుకి చెప్పాడు, అబ్బాస్. ఆ డబ్బు తనదగ్గిరే దాచమన్నాడు దాసు తురకాడు ఆడబ్బు యెగవెయ్యకతప్పదన్నారు దాసు మతస్తులు, హిందువులు.

శ్రీరామనవమి, మొహరం పండుగలొచ్చేయి. ఈ రెండు పండగలకీ పోటీ వున్నట్టు ందువులూ, ముసల్మానులు సన్నాహాలు చేస్తున్నారు. మతదీక్ష ప్రతి ఒక్కడికిపూర్తిగా పూనింది. అబ్బాస్ పేదలకి దానధర్మాలు చేస్తున్నాడు. ఆ పేదల్లో చాలామంది హిందూ బైరాగులూ, ముష్టివాళ్ళూ వున్నారు. వాళ్ళకికూడా అబ్బాస్ తన శక్త్యానుసారం దానాలు చేసేడు. ఇది చూసి ముసల్మానులు ముక్కు మీద వేలుపెట్టుకున్నారు. కొందరు వుద్రేకులయ్యేరు రాందాసుకి కొంత డబ్బు యిచ్చి నవమి పండగకి ఖర్చు పెట్టుకోమన్నాడు అబ్బాస్. దాసు దేవాలయాల్లో అభిషేకాలు చెయ్యించేడు. ఈ చేష్టలు వుభయమతస్తులలోను గందరగోళం లేవదీసేయి.

ఈలోగా హిందువులు మేళతాళాలతో దేవుణ్ణి మసీదు ముందునుంచి వూరేగింపు తీసుకెళ్ళడానికి ప్రభుత్వాన్ని అనుజ్ఞ కోరేరు. ముసల్మానులు సభచేసి, అలాంటి అనుజ్ఞయేదన్నాయిస్తే ఇస్లాంని అవమానం చేసినట్టవుతుంది - జాగ్రత్త అన్నారు. ఇటూకాక అటూకాక, ప్రభుత్వంయీ విషయమై ఆలోచిస్తున్నామన్నారు. హిందువులు తమ హిందూత్వాన్ని రక్షించుకోడానికి ఉత్సవంతో వూరేగింపులు జరిపేరు. ముసల్మానులు తమ ధర్మాన్ని సంరక్షించుకోవడానికి రాళ్ళూ యిటికెలూ పుష్కలంగాప్రయోగించేరు. పోలీసులు యిరుకక్షల్నీ నిష్పక్షపాతంగా లాఠీప్రయోగంచేసి తమ పూచీ వొదిలి చుకొని వెళ్ళిపొయ్యేరు.

"ముసింలను యిద్దరిని వూరవతల బలమైన కత్తిపోట్లు పొడిచేరు. యెవరో తెలీదు."

"నిన్నరాత్రి హిందువుల వీధొకటి తగలబెట్టబడింది."

"హిందూ స్త్రీని బలవంతంగా చెరచి చంపేసేరు"

"ఒక ముసల్మాను యింట్లో యెవరో జొరబడి సకుటుంబంగా అర్ధరాత్ర ప్పుడు చంపేసేరు. వాళ్ళని పట్టుకోవడానికి పోలీసులు చాలా ప్రయత్నం చేస్తున్నారు."

ఈ శైలిలో వార్తలొస్తున్నాయి. పత్రికలకి స్థలం ఖర్చు చేసుకోవడానికి చాలా అవకాశాలేర్పడ్డాయి.

పోలీసుల లాఠీలకీ, తుపాకులకీ కావలసినంత పని దొరికింది.

లాభాలు బాగా దోచుకుంటున్నా, జీతాలు తగ్గించేరు షావుకార్లని కూలీలు సమ్మె చేస్తున్నారు. వర్గ చైతన్యంకన్నా మత చైతన్యమే యిహ పర సుఖదాయక మని షావుకార్ల ఏజెంట్లు కూలీలకు లోపాయికారిగా చెప్పి వుద్రేకపరిచేరు. ఒకరిని వొకరు పనికి స్వస్తిచెప్పిద్దామని, తక్కువ జీతానికే తృప్తిపడి, కూలీలు పనిలో ప్రవేశించేరు. సమ్మె చేసినందుకు ప్రతి వొక్కడిదగ్గరా క్షమాపణ తీసుకుని యజమానులు ప్రవేశ పెట్టుకున్నారు. మతాలు కాపాడుకోవడం కోసం ఆపాటి త్యాగం అవసరంగానే కనుపించింది కూలీలకి.

విద్యార్థులు మత సఖ్యతకోసం ప్రచారం చేస్తున్నారు. వివిధ మతాల విద్యార్థులు వూరంతా సభలు జరిపి కొట్లాటలు మానివెయ్యవల్సిందని ప్రార్థిస్తున్నారు. నినాదాలు చెపుతూ వూరేగింపుతో విద్యార్థులు అబ్బాస్ దుకాణంవేపే పోతున్నారు.

"మతాలున్నంతకాలం కుక్కజట్టీలు తప్పవు. నేను యెక్కువనీ, నువ్వు తక్కువనీ, నాది వొప్పనీ, నీది తప్పనీ — జట్టీలు లేకపోవడం మతాలు లేక పోయినప్పుడే" అన్నాడు వూరేగింపుచూస్తూ వొక బేరగాడు.

"మతాలు లేకుండా వుండడం యెలాగండి ?" అన్నాడు దాసు.

"ఉండగలిగేది ప్రాణాలతోనూ, తిండితోనూ, మతాలతోకాదు. ఆ రెండింటినీ మతాలు మనకి క్షణక్షణ గండం చేస్తున్నాయి. మన అధోగతికి ముఖ్యకారణం మత మౌఢ్యం."

"మత సఖ్యం కలిగివుండి అందరూ సోదరుల్లాగ మెసులుకుపోతే, అందరూ సుఖంగా వుండొచ్చునండి." అన్నాడు అబ్బాస్.

"మతాలు చెప్పిన మంచిని మనం చెయ్యక చెడిపోతున్నాం," అన్నాడు.

"మంచిని కనిపెట్టే స్థితిలో వుంటేనా, దాన్ని చెయ్యడానికి ? దానిక్కారణం మతం బ్రతుకులో చొచ్చుకుపోవడానికి బదులు, దాని కతీతమై వెళ్ళడం. కావలిస్తే వొకదితో వొకటి పోట్లాడుకుంటాయికాని, యీ మతాలు మనుషుల బాగుకోసం ఆలోచించవు. ప్రయత్నించవు. ప్రస్తుతం మతాలు బాగుకన్నా చెడ్డే యెక్కువ చేస్తున్నాయి. ఇంతకీ ఈ మత వైరాలవల్ల బాధపడేది సామాన్యప్రజలు. ఇప్పటి-కొట్లాటల్లోలాగ కార్లలో తిరిగేవాటికి యే బాధా వుండదు. వారుమాత్రం యీ కష్టలకు నాయకులై పలుకుబడీ పదవులూ డబ్బూ సంపాదించుకుంటారు. ఇదే మతం చేస్తున్న ముఖ్యమైన సేవ"

"నిజమేనండి న్యాయంగా వెళ్ళేవాడికి మత మెందుకండీ," అన్నాడు అబ్బాస్.

విద్యార్థులు సఖ్యతా ప్రచారంకోసం చేస్తున్న వూరేగింపును పోలీసులు లాఠీలతో చెదరగొడుతున్నారు. దాసు దుకాణం మూసేడు. ఊరేగింపు అపరాధంగా తోచి కొందరిని జెలో వేసేరు

హిందువులు తమదగ్గిర పనిచేస్తున్న ముస్లిం నౌకర్లని తొలగించేరు దమ్మిడీ వస్తువైనాసరే ముస్లిం దుకాణంమీద కొనడం మానేసేరు. వెంటనే ముస్లిములుకూడా ఈ బహిష్కారాన్ని. అమలులో పెట్టుకున్నారు. హిందూ ముస్లింలు యుద్ధమా వుండడంవల్ల అబ్బాస్ కొట్టుకు బేరం పడిపోయింది.

•

పై వూళ్ళకెళ్ళిన రాందాసు కూరలూ, పళ్లూ కొని పట్టించుక వస్తున్నాడు. మిట్టమీధ్యాహ్నం అయింది. దాసుకి చాలా దాహంవేసింది. ఎదురుగుండావున్న దుకాణం దగ్గిరికెళ్ళి చా అడిగేడు డబ్బులిస్తూ. దుకాణదారు యివ్వనని కసిరేడు. తురకల్లో కలిసిపోయినవాడికి యివ్వనన్నాడు. నాలుగడుగులు ప్రక్కగావున్న ముస్లిం దుకాణానికెళ్ళేడు ముసల్మానైనా అమ్ముతాడుగదా అని. "పోరా కాఫర్" అని అరిచేడు దుకాణదారు. దాసు అడుగుపెట్టకముందే రెండిళ్ళ చుట్టమై మొహం వేలేసుకుని నడిచేడు డబ్బులు మొలను పెట్టుకుంటూ.

దాసు బీడీ కాల్చుకుందామని తోవలో అగుపించిన మనిషిని అగ్గిఅడిగేడు అతను కాలుస్తున్న బీడీ నోట్లోంచి తీసి యిచ్చేడు. గుంపు గుంపులుగా కేకలేసు

కుంటూ ఆవేపే మనుషులొస్తున్నారు దాసు బీడీ ముట్టించుకుంటున్నాడు. కొట్టు చంపు అని కేకలు వినిపిస్తున్నాయి. అతనూ దాసూ ఆవైపు చూస్తున్నారు. అతను దాసు మొహంలోకి చూసేడు — మరబొమ్మలాగ చేతిలోవున్న యినపపెన, దాసు నెత్తిమీద వేసేడు నెత్తురు చిమ్ముకుంటూ దాసు కూలిపోయాడు.

ఊరంతా అల్లకల్లోలం అయిపోతూవుంది. హిందువులు పృథ్వీరాజు, రాణా ప్రతాప్, శివాజీలను స్మరించి పౌరుషవంతులయ్యేరు. ముసల్మానులు గజనీ, బాబరు, ఔరంగజేబ్ మొదలైన వాళ్ళని జ్ఞాపకానికి తెచ్చుకుని ఉద్రిక్తులయ్యేరు ఈ సారి విడివిడిగా దొంగచాటున గాకుండా బహిరంగంగా గుంపు గుంపులుగా నరుక్కుంటున్నారు. ఫేక్టరీలోకికూడా యీ వార్త దూకింది. ఖురాన్ పేజీలన్నీ నానపట్టిన కత్తుల్లాగ మెరిసేయి. హిందుధర్మం శంఖుచక్ర గదాశార్ఙాలతో గిర గిరాతిరిగింది. ఫేక్టరీఅంతా రణరంగం అయిపోయింది. దొరఫోనులో చెప్పి మిలటరీని పిలిపించేడు. మిలటరీ అందర్నీ చితకబాదిచి బయటికి గెంటేరు. దొర ఫ్యాక్టరీలోని రక్తపాతమంతా కడిగించి పరిశుభ్రపరిచేడు.

దాసుకోసం బయట నిలబడి అబ్బాస్ చూస్తున్నాడు. ఇంకావుండడం ప్రమాదకరమని కొట్టు కట్టెయ్యడానికి సామాను సర్దుతున్నాడు. మూక యాభై ఆరవైమంది అబ్బాస్ దుకాణంలోకి తోసుకు వచ్చేరు నిర్జీవాలైన కాయల్నీ పళ్ళనీ కూడా బాదుతున్నారు. అబ్బాస్ మొదలు నరికిన చెట్టులాగ పడిపోయాడు ఇంకో రెండు కొట్టి అబ్బాస్‌ను కాళ్ళతో మట్టుకుంటూ దిగ్విజయంగా బయటికి పోయేరు. కొద్దిదూరంలోనే వున్న ముసల్మానుదండు యిది చూడలేకపోలేదు. మత ధర్మాన్ని ధిక్కరించినవాడి కదేశాస్తని వాళ్ళు అడ్డుపడడానికి ప్రయత్నించలేదు.

మనుష్యులు పులుల్లాగ భయంకరంగా కనిపిస్తున్నారు. దొరికిన వాళ్ళ నందర్నీ చావబాది బేడీలువేసి వూళ్ళో శాంతి నెలకొల్పింది మిలటరీ. చాలామంది చచ్చిపోయేరు. వందలకొద్దీ దెబ్బలతో చావు బ్రతుకులమధ్య పోట్లాడుతున్నారు. ఆసుపత్రి నిండిపోయింది. అబ్బాస్ స్మారకం లేకుండా వున్నాడు, గడ్డం తలలోని రక్తాన్ని పీలుస్తూంది. శరీరం ప్రాణాన్ని ముద్దుకోలేక పోయింది. శవాన్నిబయటికి తీసెయ్యమన్నాడు డాక్టర్లు. ఒక తురకాడు పోయినా కొంత పీడపోయిందే అని నిట్టూర్పు విడిచేడు ప్రక్కనే వున్న హిందూరోగి.

దాసుకి అబ్బాస్ మరిలేరన్న సంగతి తెలియనే తెలియదు. తల పోటుతో

యాతన పడుతున్నాడు. డాక్టరు పరీక్షచేసి "వాళ్ళ వాళ్లు యెవరైనా వుంటే చూసు కోమను. స్థితి ప్రమాదంగా వుంది." అనేసి, వైద్యుల కుండే నిస్సంగత్వంతో వెళ్ళిపోయేడు.

నర్సుకి స్త్రీ సహజమైన కరుణ కలిగింది. దాసు మొహందగ్గిర మొహం పెట్టి "మీ వాళ్లు యెవరైనా వుంటే చెప్పు కబురు పంపుతాను. వాళ్ళని చూద్దువు గాని" అంది.

చావు బ్రతుకుల మధ్యవున్న దాసు కళ్లు విప్పేడు. చావన్నది. ఒకటి వుందనీ, అది తనకి వొస్తున్నదనీ దానికి తాను భయపడాలనీ స్పృహే లేదు దాసుకి.

"ఏం యెవరన్నా వున్నారా మీవాళ్ళు ? వాళ్ళ నిక్కడికి రమ్మని కబురు పంపుతాను."

"అబ్బాస్ సాహెబుని రమ్మని కబురంపండి." ఆదిరి పడింది. ముసల్మాను ని పిలుస్తాడేమో అని నర్సు.

"ఎక్కడుంటాడతను ?"

"పెద్దబజార్లో దేవిడీదగ్గర పళ్ళదుకాణం" అన్నాడు మునిగి పోతున్న ప్రాణాలతో.

"సరేలే యిప్పుడే వస్తాడు. నువ్వు నిద్రపో" అని నర్సు కబురు పంప డానికెళ్ళింది.

* * *

అభ్యుదయ

1987 అక్టోబర్, నవంబర్, డిసెంబర్ 1988 జనవరి, ఫిబ్రవరి సంచికలు కావలసినవారు 15 శాతం తగ్గింపు ధరపై పొందవచ్చును.

నేడే మీ కాపీలను ఎమ్.ఒ. చెల్లించిన రశీదు పంపి తెప్పించుకోండి.

—మేనేజర్